క్లుప్తంగా

ప్రజల మన్ననలు పొందడం ఓ వరం



చెరుకుమిల్లి గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఎంపీడీఓ రాధాకృష్ణ

ఆకివీడు: వివిధ పంచాయతీల్లో ఉత్తమ సేవలందించి, ప్రజల మన్ననలు పొందడం ఒక వరమని ఎంపీడీఓ రాధాకృష్ణ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం చెరుకుమిల్లి గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సత్కార సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలందజేయడం ఎంతో ఆనందకరంగా ఉంటుందన్నారు. ప్రజల ఆదరాభిమానాలను వెలకట్టలేమన్నారు. చెరుకుమిల్లి గ్రామ ప్రజల మన్ననలు పొందిన కార్యదర్శి శ్రీనివాసరావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, ఏఓ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

అడబాల లక్ష్మీనారాయణకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అడబాల లక్ష్మీనారాయణ

వీరవాసరం: పుస్తక రచయిత, దర్శకుడు అడబాల లక్ష్మీనారాయణ(రాజు)కు గౌరవ డాక్టరేట్ వచ్చిందని శనివారం తెలిపారు. ప్రముఖ రచయత, దర్శకులు, నటులు తనికెళ్ల భరణి సలహా మేరకు, వర్ధినీడి సురేష్ కోరిక మేరకు రచించిన ×చరిత్ర లో మా వూరు × పుస్తకానికి ఊహించలేని గౌరవం దక్కిందని పుస్తక రచయిత లక్ష్మీనారాయణ తెలిపారు. ఆసియ ఇంటర్నేషనల్ కల్చర్ రీచర్చ్ యూనివర్సిటీ వారు తెలుగు లీటరేచర్ (రీసర్చ్) విభాగంలో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందని తెలిపారు. లక్ష్మీ నారాయణను శ్రీ కృష్ణ దేవరాయ నాటక కళా పరిషత్ కమిటీ, గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, తోట విజయ కుమార్, కొడమంచిలి సత్యప్రసాద్, జోగారావు, దేవిరెడ్డి పుల్లారావు, అడ్డాల బాబి, అడబాల రామకృష్ణ, పి.రమేష్, కె.కిషోర్, దేవిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

మండలపరిషత్‌కే ఫెర్రీ నిర్వహణ బాధ్యత

నరసాపురం రూరల్: మండలంలోని మాధవాయిపాలెం ఫెర్రీ పాటదారుడు రూ.50 లక్షలకు పైగా ప్రభుత్వానికి బకాయి పడటంతో ఫెర్రీ నిర్వహణ బాధ్యతను నరసాపురం మండలపరిషత్ ఆధ్వర్యంలో జరగాలని జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నిర్ణయించింది. శనివారం నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఉభయ జిల్లాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పాటదారుడు గత ఆర్థిక సంవత్సరం బకాయి, ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఆర్థిక సంఘం రేవుపాట నిర్వహించనందున రోజువారీ చెల్లింపుల ప్రాతిపదికపై పాత పాటదారునికే ఉన్నతాధికారుల ఆదేశాలతో రేవు నిర్వాహణా బాధ్యతలు అప్పగించారు. పాత, కొత్త బకాయిలు వెరశి రూ.53 లక్షలకు చేరడం , పాటదారుడు అధికారుల ఆదేశాలకు అనుగుణంగా చెల్లింపులు చేయకపోవడం తదితర కారణాలతో అతని నుండీ రేవు నిర్వహణ స్వాధీనం చేసుకుని నరసాపురం మండల పరిషత్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించాలని జేఏసీ నిర్ణయించింది.

జూలై 3 నుంచి నిర్వహణ

జూలై 1,2 తేదీల్లో సామాజిక పింఛన్ల పంపిణీ ఉన్నందున జూలై 3 నుంచి రేవు నిర్వహణా బాధ్యత మండల పరిషత్ ఆధీనంలోకి రానుంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలానికి రేవు నిర్వహణా బాధ్యతలను అప్పగించేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. షెడ్యూల్ ప్రకారం 7వ తేదీ రేవు పాట జరగాల్సి ఉంది. సఖినేటిపల్లిలంక వాసులకు రేవులో రాకపోకలు ఉచితంగా సాగించేలా అవకాశం కల్పించాలని సర్పంచ్ రేవూరి ఏసు నర్సింహరాజు వినతి పత్రం అందజేశారు. సాంప్రదాయంగా రేవు ఏర్పడిన నాటి నుంచి లంకవాసులకు ఈ సౌకర్యం ఉందన్నారు. రేవు పాట దారుని దృష్టికి ముందుగానే ఈ విషయాన్ని అధికారులు తీసుకువెళ్లి భవిష్యత్‌లో సఖినేటిపల్లిలంక వాసుల మనోబావాలు దెబ్బతినకుండా చూడాలని సర్పంచ్ ఆ వినతి పత్రంలో కోరారు. సమావేశంలో నరసాపురం, సఖినేటిపల్లి ఎంపీపీలు మైలాబత్తుల సోని, మల్లికార్జునరావు డీఎల్పీవోలు శ్రీనివాసు, బొజ్జిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీడీఓ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం జిల్లా జేఏసీ ఏర్పాటు

పాలకొల్లు అర్బన్: ఉపాధి హామీ పథకం జిల్లా స్థాయి జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లాలోని 20 మండలాలకు చెందిన ఏపీవో, ఈసీ, టీఏ, సీవో, ఫీల్డ్ అసిస్టెంట్, అన్ని కేడర్లకు చెందిన ఉద్యోగులు హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు.

భైరవం..భీకరం..

- బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు
- సంతతి నియంత్రణ చర్యల్లో అధికారులు విఫలం
- నిత్యం గాయాల పాలవుతున్న పాదచారులు, వాహన చోదకులు





వీధి కుక్కలు

వీరవాసరం: నియోజకవర్గంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాస్త జనసంచారం తగ్గాక పాదచారులు, వాహన చోదకులను వెంబడిస్తూ గాయాలపాలు చేస్తున్నాయి. ఇటీవల కుక్కలు రెండు రోజుల్లోనే దాదాపు 16మందిని గాయపర్చడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వ వైద్యశాలలకు నిత్యం ఐదు నుంచి 8మందివరకు కుక్క కాటు కేసులు వస్తున్నాయని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు చెబుతున్నారు. వీరవాసరం, భీమవరం తదితర గ్రామాల్లో పలు ప్రాంతాల్లోను కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ దారిన పోయే వారిపై చిన్న పిల్లలపై దాడు చేసి గాయపరుస్తున్నాయి. కుక్కల నియంత్రణతో పాటు వాటి సంతాన నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పశువులపైనా దాడి

గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు, పశువులపైన దాడి చేస్తున్నాయి. గేదెలు, కోళ్లు, పావురాలు, పంది పిల్లలు పెంపుడు జంతువులపై కుక్కలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయని మండల,గ్రామాల్లోని ఉన్నతాధికారులు స్పందించి కుక్కల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నియంత్రణ కరువు

- యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) అంటే జంతువుల కుటుంబ నియంత్రణ చేపట్టడం లేదు
- ఏసీబీ ఏజెన్సీని నియమించి వీధికుక్కలు, కోతులు, ఇతర జంతువుల నుంచి మనుషులకు హానీ కలుగుకుండా నియంత్రణ చర్యలు శూన్యం.
- జంతువులకు కుటుం నియంత్రణ చేసే ఏజెన్సీ ఎక్కడా లేదన్న విమర్శలున్నాయి.
- పశువులకు ముందస్తుగా రేబీస్ వ్యాక్సిన్ వేయించాలి హోటళ్లు, హాస్టళ్లు, ఫంక్షన్లో మిగిలిన ఆహారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేస్తే కుక్కల సంచారం పెరుగుతుంది. అలా పడేయకపోవడం మంచిది.

కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వీధి కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ మధ్యకాలంలో కుక్కకాటుకు గురయ్యే వారు ఎక్కువగా ఉంటున్నారు. ఆస్పత్రిలో కుక్కకాటుకు సంబంధించిన యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులోనే ఉన్నాయి. కుక్క కరిచిన వెంటనే సబ్బు నీళ్లతో పరిశుభ్రంగా కడిగి ఆస్పత్రిలో సంప్రదించాలి



డాక్టర్ నవనీత్, కొణితివాడ పీహెచ్‌సీ

నగర పంచాయతీ అభివృద్ధికి సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జామి హైమావతి.

ఆకివీడు: నగర పంచాయతీ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులంతా సమిష్టిగా కృషి చేద్దామని చైర్‌పర్సన్ జామి హైమావతి పిలుపునిచ్చారు. కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుకుందామన్నారు. అన్ని వార్డుల్లో సమస్యల్ని పరిగణలోకి తీసుకుని ప్రాధాన్యతతో పనులు చేపడదామన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్యం మెరుగుకు, ప్రధాన మురుగు కాల్వల అభివృద్ధికి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు సూచనల మేరకు సత్వర చర్యలు చేపట్టామన్నారు. భారీ వర్షాలకు పట్టణంలోని వీధులు మునిగిపోకుండా డ్రెయినేజీలను శుభ్రపరచామన్నారు. నగర పంచాయతీ ఆదాయం పెంపునకు చర్యలు చేపట్టామన్నారు. కౌన్సిలర్ నిమ్మల నాగు మాట్లాడుతూ వీధి పేర్లను మార్చి ఇంటి పన్ను రశీదులిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మాదివాడలోని ప్రధాన వీధి రాజవీధిగా పూర్వం నుండి వస్తుందని, దానిని అడపా వారి వీధిగా మార్చి పన్ను రశీదులిస్తున్నారన్నారు. సచివాలయం-3 పరిధిలో అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందడంలేదన్నారు. ఇళ్ల స్థలం 1000 చ.అడుగులు లోపు ఉన్నవారే 138 మంది ఉన్నారని, సచివాలయ సిబ్బంది అవగాహనాలోపంతో అనర్హులయ్యారన్నారు. లాగిన్‌లో అనర్హులుగా సూచిస్తున్నవారి వివరాల్ని పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. వైస్‌చైర్మన్ పుప్పాల పండు మాట్లాడుతూ రజక(రాళ్ళ) చెరువు గతంలో పశువుల చెరువుగా ఉండేదన్నారు. చెరువులో రజకులు బట్టలు ఉతుక్కునే విధంగానూ, రైతులు పశువులను కడుగుకునే విధంగా అవకాశం కల్పించాలన్నారు. నగర పంచాయతీ ఆదాయం మెరగుపరచాలని, నాన్‌లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న టీపీఎస్ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కుళాయిల ద్వారా మంచినీరు రావడంలేదని టీడీపీ కౌన్సిలర్‌లు గోపిశెట్టి సత్యవతి, కిమిడి అరుణ కుమారి, బొల్లా వీర శ్వేత,గుర్రాన నాగలక్ష్మి, నేరెళ్ల ప్రసన్న, బత్తుల శ్యామ, మోపిదేవి సత్యవతి ఆవేదన వ్యక్తంచేశారు. కోఆప్షన్ సభ్యులు ఎండీ.జక్కీ, గుండుగొలను సావిత్రి మాట్లాడుతూ తమకు గౌరవ వేతనం చెల్లించడంలేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. హరిసజనపేటలో వీధి లైట్లు వేయాలని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ కుళాయిల ద్వారా మంచినీరు సరఫరాచేసేందుకు వాటర్ వర్క్స్ ఏఈ నియామకం జరిగిందని, ఇకపై స్వచ్ఛమైన నీరు సరఫరా చేస్తారని చెప్పారు. వీధిపేర్ల మార్పులపై సచివాలయ సిబ్బందికి సూచనలిస్తామన్నారు. కోఆప్షన్‌సభ్యుల గౌరవ వేతనం గతలో తీర్మానం చేయలేదని, దీనిపై డైరెక్టరేట్‌కు లిఖితపూర్వకంగా తెలియజేసి, బకాయిలు కూడా చెల్లించే విధంగా కోరుతూ లేఖ రాసినట్లు వివరించారు. తొలుత ఎజెండాలోని పలు అంశాల్ని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్‌లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, కటికతల జాన్ వెస్లీ, జిల్లా పెద్దిరాజు, దొడ్డి జగదీష్, గేదల అప్పారావు, ఎండీ. అప్రవున్నీస్సా, తిరుమారెడ్డి మాధవి, మోటుపల్లి కుమారి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తే సహించం

భీమవరం (ప్రకాశంచౌక్): రాజ్యాంగాన్ని తూట్లు పొడిస్తుంది బిజేపీనేనని, రాజ్యాంగాన్ని కాపాడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంకెం సీతారామ్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ హయాంలోనే వంద ఎమర్జెన్సీలు వస్తున్నాయనని, కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇందిరా గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించిందని, ఆమె దేశానికి ఏం తక్కువ చేసిందని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారని మండి పడ్డారు. సాగు చట్టాలను తెచ్చి రైతులను హింసించిన బీజేపీ ఈ అంశంపై పార్లమెంట్‌లో ఎందుకు చర్చించడం లేదన్నారు. నీట్ రాసిన విద్యార్థులకు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని, వారికి న్యాయం చేసేందుకు రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడు సోము నాగ కేశవబాబు, ఎన్ఎస్ యుఐ జిల్లా ప్రెసిడెంట్ చింతగుంట మహేష్, గౌరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉంటేనే భవిత



డీఎన్నార్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

భీమవరం (ప్రకాశంచౌక్): యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ స్వరాజ్యలక్ష్మి అన్నారు. భీమవరం డిఎన్నార్ జూనియర్ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిస కావడం వల్ల మానసిక, ఆరోగ్య సమస్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ చాలా నష్టపోతుందని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ అనేక విధమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎక్సైజ్ ఆఫీసర్ చిట్టిబాబు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాల వద్ద తెలియని వ్యక్తులు చాక్లెట్, ఇతర వస్తు రూపంలో ఇచ్చినట్లయితే అటువంటి స్వీకరించరాదని పిల్లలు, యువతను కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మత్తు పదార్థాల క్రయ విక్రయాలు సమాచారాన్ని 100,112 కుగాని సంబంధింత పోలీస్ అధికారులకు తెలియజేసి జిల్లా పోలీస్ శాఖ సహకరించాలని కోరారు. అనంతరం 36 మంది విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ప్రిన్సిపల్ శివాజీ రాజు, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, ఎన్ఎస్ ఎస్ ఆఫీసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో విజయవంతంగా ఎన్నికలు



ఉండిలో అధికారులను సత్కరిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య.

ఉండి: అధికారులందరి సహకారంతోనే సార్వత్రిక ఎన్నికలు ఉండి నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించామని జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. శనివారం గత సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన అధికారులను ఉండి లయన్స్ ఆడిటోరియంలో జేసీ శనివారం ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఆకివీడులో..

ఆకివీడు: ఎన్నికల విధుల్ని విజయవంతంగా నిర్వహించిన మండలంలోని పలువురు అధికారులు, సిబ్బందిని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య స్కరించడంస మండలంలోని అధికారులు శనివారం హర్షం వ్యక్తంచేశారు. తమ సేవల్ని గుర్తించి సత్కరించడం మరిచిపోలేని సంఘటన అని పేర్కొన్నారు. మండలంలోని తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీఓ రాధాకృష్ణ, ఏఓ శ్రీకర్, ఈఓపీఆర్డీ సుబ్బారావు, ఏఓ ప్రియాంక, ఏపీఎం రమేష్ నాయుడు, ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్ పార్వతి, ఏఈ పీఆర్ రమణమ్మ, నగర పంచాయితీ కమిషనర్ జీవీ.కృష్ణమోహన్, డీటీ సయ్యద్ ఫరూక్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

స్వామి వివేకానంద బోధనలు అనుసరణీయం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి నాగరాణి..

కాళ్ల: స్వామి వివేకానంద బోధనలు అనుసరణీయమని, దైనందిన జీవితంలో ఆధ్యాత్మికత కూడా అవసరమని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. కాళ్ల మండలం పెద అమిరంలో వున్న వివేకానంద సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి. నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస బోధనలు ఎంతో ప్రశాంతతను ఇస్తాయన్నారు. వివేకానంద సేవా సమితితో నాకు సుమారు 25 సంవత్సరాలు అనుబంధం ఉందని అన్నారు. తొలుత వివేకానంద సేవా సమితి ఆవరణలో నూతనంగా నిర్మించిన నివేదిత భవనాన్ని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవాసమితి అధ్యక్షులు వి.శివ వర్మ, కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, నందమూరి రాజేష్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ డిజిటల్ స్కూల్‌కు అనుమతి లేదు

ఆకివీడు: స్థానిక జెడ్పీ హైస్కూల్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఇండియన్ డిజిటల్ స్కూల్‌కు అనుమతి లేదని మండల విద్యాశాఖ అధికారి ఎ.రవీంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతంలో తీసివేసిన ఒక ప్రైవేటు స్కూల్ భవనంలో స్కూల్ నడుపుతున్నట్లు తమకు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఆ భవనం వద్ద నోటీసు బోర్డు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు. అనుమతి లేని స్కూళ్లలో పిల్లల్ని చేర్పించవద్దని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అలాంటి పాఠశాలలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఉండిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈవో జ్యోతి

ఉండి: నింబధనలు అతిక్రమించే ప్రైవేటు స్కూల్స్‌పై కఠిన చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి బీ జ్యోతి హెచ్చరించారు.శనివారం మండలంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగులు వంటి విద్యాసామాగ్రిని అమ్మకం చేస్తున్నారంటూ,ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కూడా అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు ఎంఈవో పాఠశాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో అక్రమంగా పుస్తకాలు కలిగి ఉన్నారని గుర్తించి వాటిని ప్రత్యేకమైన గదిలో పెట్టి సీల్ వేశారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం పట్టించుకోవట్లేదని దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులను పంపిస్తానని అన్నారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చి ప్రైవేటు స్కూల్స్ దోపిడీకి తెరతీసాయని అన్నారు. ఇప్పటికే ఉండి,భీమవరం తదితర ప్రాంతాల్లో వివిధ ప్రైవేటు స్కూల్స్‌పై ఫిర్యాదు చేశామని అన్నారు.ప్రైవేటు స్కూల్స్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని దీనిపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరుతున్నట్లు వారు తెలిపారు.

హాస్టల్ తనిఖీ చేసిన కమిషనర్

నరసాపురం: పట్టణంలోని 19వవార్డులో ఉన్న బీసీ బాలుర హాస్టల్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వద్ద పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. అలాగే విద్యార్థులు పడక గదులు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, టాయిలెట్స్ పరిశీలించారు. వ్యాధుల సీజన్ కావడంతో పరిశుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. హాస్టల్ పరిసరాల్లో ముగ్గు, ఎంఎల్ ఆయిల్ చల్లించారు.

ప్రైవేట్ టెలికం ధరల పెంపుపై నిరసన



ఉండిలో ప్రైవేట్ టెలికం ధరల పెంపుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఉండి: వినియోగదారుల నడ్డివిరిచి లాభాలు సంపాధనే ధ్యేయంగా జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ధరలు పెంచేందుకు సిద్ధం కావడం దారుణమని సీపీయం జిల్లా నాయకుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. టెలికం సంస్థలు సుమారు 20 శాతం ధరల పెంపు నిర్ణయంపై సీపీఎం మండల కన్వీనర్ డీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఉండి సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ టెలికం కంపెనీలు వినియోగదారులను ఆకర్షించేలా టారీఫ్‌లు తగ్గించి వినియోగదారులు పెరగ్గానే టారీఫ్‌లు పెంచేస్తున్నాయన్నారు. జియో, ఎయిర్‌టెల్ సంస్థల రాకతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు గణనీయంగా తగ్గిపోయారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను కూడా మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చీర్లోషు, కొట్టాడ వెంకటేశ్వరరావు, వీరవల్లి శ్రీనివాస్, రామకూరి వెకటరత్నం, మునకాల రవిరాజు, మోపిదేవి రాము తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

పాలకోడేరు: రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల వర్గాల వారికి పెద్ద ఎత్తున అందించే ఫించన్ సొమ్మును సోమవారం పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో టి.అనూహ్య తెలిపారు. పాలకోడేరు మండలం లో 9290 మందికి రూ.6,7,00,5000 పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పంపించి ఫించన్ సొమ్మును లబ్ధిదారులకు అందిస్తారని వివరించారు.

స్టీల్ ప్లాంట్ ఆస్తులను పరిరక్షించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): స్టీల్ ప్లాంట్ ఆస్తులను పరిరక్షించాలని సీపీఎం నాయకుడు బలరాం తెలిపారు. సీపీఎం వీరవాసరం మండల కమిటీ సమావేశం జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన భీమవరంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా బి.బలరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే విశాఖ స్టీల్ ప్లాంట్ ఆస్తుల అమ్మకం ఆపాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అన్ని విధాలా రాష్ట్రాన్ని అన్యాయం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈవిషయంపై నోరుమెదపకపోవడం చాలాదారుణమని బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం సామాన్యులపై ధరల భారాలు తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ,16 ప్రైవేటు ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత ప్రవేశాల కోసం మొదటి విడతలో మిగిలిన సీట్లకు వచ్చే నెల 24లోపు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకుని విద్యార్థులు ఐటీఐ డాట్ జీవోవీ డాట్ ఇన్ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకుని రసీదు పొందాలని సూచించారు. కౌన్సిలింగ్ సమయంలో రసీదు చూపించినవారే కౌన్సిలింగ్‌కు అర్హులని తెలిపారు. కాబట్టి విద్యార్థులు జూలై 24 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవడంతో పాటు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేసుకోవాలని తెలిపారు. అలాగే 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు వెల్డర్ ఒక సంత్సరం కోర్సు కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు 08816 297093, 96760 99988కు ఫోన్ చేయాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: మండలంలోని వరహా గిరి, వెంకట గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో చేరేందుకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ , పీజీ కోర్సులో చేరేందుకు కళాశాలలో అన్ని వసతులూ ఉన్నాయన్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులు, ఆధునిక ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్స్, ఇంటర్‌నెట్ సౌకర్యం, విశాలమైన క్రీడా ప్రాంగణం , ఓపెన్ జిమ్, స్కిల్ హబ్,ఫీజు రీయిబర్స్‌మెంట్ సౌకర్యం, విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉందని చెప్పారు. సమీపంలోని ఆలపాడు, తాడినాడ, అయిభీమవరం, మందపాడు గ్రామాలకు చెందిన విద్యార్థులకు బస్సు సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. కళాశాలలో బీఏ(ఎకనామిక్స్), బీఎస్సీ(కంప్యూటర్ సైన్సు, ఫిజిక్స్, కంప్యూటర్ అప్లికేషన్, రసాయిన శాస్త్రం)తో పాటు ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని సుజాత వివరించారు. 2024-25 విద్యా సంవత్సరంలో పీజీ ప్రవేశం నిమిత్తం జరిగిన ప్రవేశ పరీక్షల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 8 మంది వెయ్యి లోపు ర్యాంక్, ముగ్గురు వెయ్యి పైన ర్యాంకు సాధించారని ఆమె వివరించారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణాంక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణాంకశాస్త్ర పితామహుడు పిసి మహలనోబిస్ శాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్

90102 23729

79955 66351

90108 51166

Office mail : tpgadvt@gmail.com